# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 22-05-2026** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **విద్యార్థులు విస్తృత అవగాహన పెంపొందించుకోవడానికి విద్యా పర్యటనలు ఉ పయోగపడతాయని ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్ తెలిపారు.**

2. **ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆమోదం పొందిన ప్రాజెక్టులు 2028 నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

3. **ప్రజల ఆరోగ్య రక్షణకుతాగునీటి నాణ్యత పెంపు అత్యంత ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు.**

4. **తెలంగాణలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు.**

==========================

భారత ఉపరాష్ట్రపతి సీపీ రాధాకృష్ణన్‌ను ఆంధ్రప్రదేశ్ లోని గుంటూరు ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు నిన్న ఢిల్లీలో కలిశారు. విద్యా పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్, గుంటూరు శాసనసభ్యురాలు గళ్ళా మాధవి ఆధ్వర్యంలో 41 మంది విద్యార్థుల బృందం ఢిల్లీకి వెళ్లింది. విద్యార్థుల బృందంలో 27 మంది బాలికలు ఉండటంపై ఉప రాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. ఈసందర్భంగా ఉపరాష్ట్రపతి మాట్లాడుతూ, తరగతి గదులకే పరిమితం కాకుండా విద్యార్థులు విస్తృత అవగాహన పెంపొందించుకోవడానికి ఇలాంటి విద్యా పర్యటనలు ఉపయోగపడతాయని తెలిపారు. దేశంలోని అనేక మంది గొప్ప శాస్త్రవేత్తలు, నాయకులు ప్రభుత్వ పాఠశాలల నుంచే వచ్చారని ఉపరాష్ట్రపతి తెలియజేస్తూ...

వాయిస్ 30 సెకన్లు

-------------------------

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ఆమోదం పొందిన అన్ని ప్రాజెక్టుల పనులను ఈ ఏడాది సెప్టెంబర్ కల్లా పూర్తిచేసి, 2028 నాటికి కార్యకలాపాలు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. విశాఖ భాగస్వామ్య సదస్సు ఒప్పందాలు, రాష్ట్ర పెట్టుబడుల ప్రోత్సాహక మండలి – ఎస్ఐపీబీ ఆమోదించిన ప్రాజెక్టుల పురోగతిపై అమరావతిలోని రాష్ట్ర సచివాలయంలో నిన్న సమీక్షించారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ, పెట్టుబడిదారులకు అనుమతులు, ప్రాజెక్టుల పురోగతి, ఉ

ద్యోగాల వివరాల కోసం సింగిల్ పోర్టల్ ఏర్పాటు చేయాలని సూచించారు. భూ కేటాయింపుల్లో పర్యాటక ప్రాజెక్టులకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలని స్పష్టం చేశారు. పరిశ్రమల్లో పర్యావరణ హిత సాంకేతికత వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు.

---------------------------

ప్రజల ఆరోగ్య రక్షణకు తాగునీటి నాణ్యత పెంపు అత్యంత ముఖ్యమని ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి కె పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. గ్రామీణ నీటి సరఫరా శాఖ ఉన్నతాధికారులతో ఉప ముఖ్యమంత్రి నిన్న సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పవన్ కళ్యాణ్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి పంచాయతీలో వడపోత ఫిల్టర్ బెడ్లను నెల రోజుల్లోగా శుభ్రం చేయాలని ఆదేశించారు. గృహ అవసరాలకూ పూర్తిస్థాయిలో శుద్ధి చేసిన నీటినే వినియోగించేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ప్రభుత్వం ఆమోదించిన గ్రామీణ తాగునీటి పథకాల పనులకు సంబంధించిన ముందస్తు ప్రక్రియలను వేగంగా పూర్తి చేసి, వెంటనే క్షేత్రస్థాయిలో ప్రారంభించాలని మార్గనిర్దేశం చేశారు.

---------------------------

అంతర్జాతీయ ప్రమాణాల దిశగా ఆంధ్రప్రదేశ్ విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని హోం మంత్రి వి.అనిత తెలిపారు. అనకాపల్లి జిల్లా నక్కపల్లిలో పదవ తరగతి పరీక్షల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నిర్వహించిన “షైనింగ్ స్టార్స్” అభినందన కార్యక్రమంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈసందర్భంగా పాయకరావుపేట నియోజకవర్గ పరిధిలో 103 మంది విద్యార్థులకు నగదు బహుమతులు అందజేశారు. అనంతరం మంత్రి అనిత మాట్లాడుతూ, ప్రభుత్వం విద్యా రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చిందన్నారు. వంద రోజుల ప్రత్యేక ప్రణాళికల కారణంగా ఈసారి పదవ తరగతి ఫలితాలు మెరుగ్గా వచ్చాయని మంత్రి పేర్కొంటూ..

వాయిస్ 30 సెకన్లు

---------------------------

తెలంగాణలో మొక్కజొన్న, జొన్న, ఆయిల్ పామ్, పత్తి రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహన్ ను కోరారు. హైదరాబాద్ పర్యటనకు వచ్చిన కేంద్రమంత్రిని కలిసి నిన్న పలు వినతిపత్రాలు సమర్పించారు. మొక్కజొన్న, జొన్న పంటలను కేంద్ర నోడల్‌సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఆయిల్‌పామ్ దిగుమతి సుంకం పెంచాలని, హెచ్ పత్తిపై జాతీయ విధానం ప్రకటించాలని కోరారు. సమీకృత ఉద్యాన అభివృద్ధి పథకం వంటి కేంద్ర పథకాలకు తెలంగాణకు కేటాయిస్తున్న నిధులను పెంచాలని చేశారు. ఈ సందర్భంగా కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ మాట్లాడుతూ.. సంబంధిత శాఖలతో చర్చించి తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

---------------------------

ఆంధ్రప్రదేశ్ లో 22ఏ నిషేధిత జాబితాలో ఉన్న భూములపై శాశ్వత హక్కులు అందిస్తున్నామని రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్ తెలిపారు. ఇప్పటికే లక్షా 60 వేల ఎకరాల భూములను 22ఏ జాబితా నుంచి తొలగించి రైతులకు పూర్తి హక్కులు కల్పించినట్లు నిన్న ఒక ప్రకటనలో వెల్లడించారు.

---------------------------

---

రహదారి విస్తరణ పనుల్లో భాగంగా నివాసాలు కోల్పోతున్న నంద్యాల బొగ్గులైన్ బాధితులకు అండగా ఉంటామని, వారికి పునరావాసం కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ తెలిపారు. నంద్యాలలో బొగ్గులైన్ బాధితుల కోసం స్థల సేకరణ ప్రక్రియలో భాగంగా మంత్రి అధికారులతో కలిసి పలు ప్రాంతాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ... బొగ్గులైన్ బాధితులకు రెండు సెంట్ల స్థలం కేటాయించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. స్థల సేకరణ ప్రక్రియను త్వరితగతిన పూర్తి చేసి, బాధితులకు ఇళ్ల స్థలాల పంపిణీ చేపడతామని మంత్రి తెలిపారు.

---

ఆంధ్రప్రదేశ్ లోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలో నిర్వహించిన 15వ జాతీయ స్థాయి సబ్ జూనియర్ పురుషులు, మహిళల క్లాసిక్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ పోటీలు నిన్న ఘనంగా ముగిశాయి. అంతర్జాతీయ పవర్ లిఫ్టింగ్ సమాఖ్య, కామన్‌వెల్త్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ పోటీల ముగింపు కార్యక్రమంలో అమలాపురం పార్లమెంట్ సభ్యులు జి. హరీష్ మాథూర్, జిల్లా ఎస్పీ రాహుల్ మీనా పాల్గొన్నారు. జాతీయ స్థాయి పోటీలకు అమలాపురం వేదిక కావడం ఆనందంగా ఉందని ఈ సందర్భంగా హరీష్ మాథూర్ తెలియజేస్తూ..,

వాయిస్ 34 సెకన్లు

---

తెలంగాణ ఆర్థికాభివృద్ధికి, యువతకు ఉపాధి కల్పనకు, పర్యాటక రంగం కీలకమని పర్యాటక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు పేర్కొన్నారు. హైదరాబాద్ లోని బేగంపేట టూరిజం ప్లాజాలో నిర్వహించిన తెలంగాణ పర్యాటక క్రియేటర్ల సమావేశంలో మంత్రి నిన్న పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. డిజిటల్ వేదికల ద్వారా తెలంగాణ ప్రకృతి అందాలు, చారిత్రక వైభవం, సంస్కృతి సంపదను ప్రపంచానికి చాటాలని సూచించారు. 'ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక'లో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం పర్యాటక రంగానికి ప్రత్యేక కార్యాచరణ చేపట్టిందని తెలిపారు. పర్యాటక ప్రాంతాల్లో స్వచ్ఛత, కనీస వసతులు, ఆధునిక టెంట్ సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని మంత్రి వివరించారు.

---

ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఎండల తీవ్రత కొనసాగుతోంది. ఆంధ్రప్రదేశ్లో ఈరోజు పలు జిల్లాలోని 15 మండలాల్లో తీవ్రవడగాల్పులు, 219 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని అమరావతి వాతావరణ కేంద్రం తెలిపింది. కోస్తా జిల్లాలోని కొన్ని ప్రాంతాల్లో 45 – 47 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని పేర్కొంది. పల్నాడు జిల్లా పిడుగురాళ్లలో నిన్న గరిష్ఠ ఉష్ణోగ్రత 48.1 డిగ్రీలు నమోదైందని తెలిపింది .

తెలంగాణలో ఈరోజు, రేపు కూడా పలు ప్రాంతాల్లో వడగాలులు వీచే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో 45 డిగ్రీలకుపైగా ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉందని 'రెడ్ అలర్ట్' జారీ చేసింది. రాష్ట్రంలో అత్యధికంగా పెద్దపల్లి జిల్లా ముత్తారం, సూర్యాపేట జిల్లా మునగాలలో 46.5 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలు నమోదైయ్యాయని తెలిపింది .

=====================